# శివాని

కథ

- డాక్టర్ జె. భాగ్యలక్ష్మి

మళ్ళీ ఫోను మోగుతోంది. ఈ రాత్రి ఇది మూడోసారి. గంట గంటకూ మోగుతున్నట్లు అనిపిస్తోంది గంగాధరానికి టైమ్ తెల్లవారు జామున మూడుగంటలు, శివాని పక్కలోనే వణకిపోతోంది. వాళ్ళ నాన్న గంగాధరమే మళ్ళీ ఫోన్ తీశాడు. అవతలనుండి అమెరికన్ యాసలో వినిపించింది. "శివానీతో మాట్లాడాలి."

"మీరెవరు?"

"ఇంతకూ మీరెవరు?"

"బాగుంది మా ఇంటికి ఫోను చేసి నన్నే ఎవరని అడుగుతావే!"

"ఇది శివాని కాంటాక్ట్ నంబరా కాదా?"

"అవును."

"అయితే ఆమెను మాట్లడ మను. మధ్యలో నువ్వేంటి పానకంలో పుడకలా."

"వెధవా నువ్వెవరు?"

"ఓ.......షటప్" అని అవతలివాడు ఫోను పెట్టాశాడు. గంగాధరానికి పిచ్చెత్తినట్లుంది. కోపానికీ తక్కువ లేదు. పడుకొన్న శివానీని లేపి ఎడాపెడామని చెంపలు వయించాలనిపిస్తోంది. ఇప్పటి కొచ్చిన మూడు కాల్స్ ఇలాగే ఉన్నాయి. ఆ రాత్రికి జాగారమే పైగా ఈ టెన్షన్. ఇదివరకు ఫోన్ చేసిన వాళ్ళు "శివానీతో డేట్ కావాలి" అని ఒకడంటే "శివానీ



"ఫ్రీ యేమో కనుక్కొందామని" అని మరొకడన్నాడు. రెండు రోజుల నుంచి బ్లాంక్ కాల్స్ వస్తున్నాయి. "హలో, హలో" అని ఎంత అరచినా అవతలి వాళ్ళు మాట్లాడరు. ఈ రోజేమో ఈ చిత్రమైన ఫోన్లు.

శివానీ ఇప్పుడిప్పుడే డిగ్రీకోర్సులో చేరింది. కంప్యూటర్లలో స్పెషల్ కోర్సు చేస్తానంటే సరేనని బోలెడు ఫీజు కట్టి ప్రైవేటు ఇన్‌స్టిట్యూషన్‌లో చేర్పించాడు. ఇటూ అటూ స్వేచ్ఛగా తిరుగుతున్నందున స్నేహాలు! అందులో మగవాళ్ళు ఫోను చేసి ఈ ఆరాలు తియ్యటమేమిటి?

ఉదయం పేపరు చదువుకొంటున్నప్పుడు శివానీ కాలేజికి వెళ్ళటానికి తయారవటం గమనించాడు గంగాధరం.

"శివానీ, ఇలా రా!"



శివానీ బెదురుతు బెదురుతూ వచ్చింది. ఆమె గుడె దడదడ కొట్టుకొంటోంది. అర్ధరాత్రి ఫోన్ల గురించే నాన్నగారు అడుగుతారని తనకు తెలుసు. ఎందుకంటే నిన్నా మొన్నా వచ్చిన బ్లాంక్ కాల్స్ తను తీస్తే మాత్రం ఏవేవో వెకిలిగా మాట్లాడేవి. వాళ్ళెవరో తనకెందుకు ఫోను చేస్తున్నారో, ఎవరితో ఆ బాధ పంచుకోవాలో తెలీక సతమతమవుతోంది ఆ అమ్మాయి.

గంగాధరం కూతురివైపు చూసి "కాలేజికి వెళ్తున్నావా?" అని అడిగాడు.

అవునని తల ఊపింది.

"శ్రద్ధగా చదువుకొంటున్నావా?"

"బాగానే చదువుతున్నాను, నాన్న గారూ."

"సాయంకాలం కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్తున్నవు కదా. వచ్చేటప్పుడు బస్సు దొరుకుతోందా? మరీ ఆలస్యం కావటం లేదు కదా."

"ఏడు గంటల కల్లా క్లాసు అయిపోతుంది. ఇన్‌స్టిట్యూట్ ప్రక్కనే బస్టాపు. ఐదు, పది నిముషాలలోపుగా బస్సు దొరుకుతుంది."

"క్లాసులెగ్గొట్టి ఫ్రెండ్సుతో ఇటూ అటూ జల్సాలు చెయ్యటం లేదు కదా," శివానీని పరిశీలనగా చూస్తూ అడిగాడు గంగాధరం. "లేదు, లేదు", అటువంటిదేమీలేదు, కాస్త తడబడుతూ సమాధానమిచ్చింది.

"చూడు ఎవరైనా నిన్ను అల్లరిపెడుతుంటే నాకు చెప్పు. భయపడకు, అంతేగానీ మా కన్నులు కప్పి తప్పుడు పనులు చేస్తే ఊర్కోనేది లేదు. అర్థమైందా?" గట్టిగానే చెప్పాడు.

శివానీ తల ఊపుతూ, కళ్ళనీళ్ళు తుడుచుకొంటూ అక్కడి నుంచి వెళ్ళబోయింది.

"శివానీ....." తను ఆగింది.

"శివానీ, రాత్రి మూడుసార్లు ఫోనొచ్చింది నీ కోసం. ఒకటి ఫారిన్ కాల్ అనుకొన్నాను? ఎవరికైనా ఫోను నంబరు ఇచ్చావా?"

"లేదు నాన్నగారూ. నా క్లాస్‌మేట్స్‌కి అందులో క్లోజ్ ఫ్రెండ్స్‌కే నా నంబరు తెలుసు."

"ఆ ఫ్రెండ్స్‌లో బాయ్స్ కూడా ఉన్నారా?"

"కొద్దిగా పరిచయమే, అంత ఫ్రెండ్సు ఎవరూలేరు."

"ఇన్‌స్టిట్యూట్లో...."

"అక్కడా అంతే. హలో అంటే హలో అనటమే. కాకపోయినా మాకు కంప్యూటర్ రెండుగంటలకు ఇస్తారు. ఆ సమయం ఎవరూ వేస్ట్ చేసుకోరు."

"సరే నువ్వుకాలేజికి వెళ్ళు."

గంగాధరం ఆ ఫోన్ కాల్స్ గురించి అట్టే ఆలోచించలేదు. ఎవరో వెర్రి వెధవలు, పనీపాటా లేనివాళ్ళ పని అది అనుకొన్నాడు. ఆ సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి వచ్చేసరికి సావిత్రి కొంచెం చికాగ్గా కనిపించింది.

"ఈ రోజు వెళ్ళలేదా సావిత్రీ" అని అడిగాడు గంగాధరం. ఆమె ఒక యన్.జి.ఓ. లో పని చేస్తోంది."

"ఉదయం ఒక పూట వెళ్ళి వచ్చేశాను. మాది ఇప్పుడు లిటరసీ ప్రోగ్రామ్ కదా! పట్టణంలోనే మురికివాడల్లో



చదువు చెప్పటం. గ్రూపులందరికీ చెప్పవలసింది చెప్పి, సూచనలిచ్చి నేను వచ్చేశాను. మీరు మొహం కడుక్కొని బట్టలు మార్చుకోండి. టీ తెస్తాను."

ఇద్దరూ టీ తాగుతూ, బిస్కెట్లు తింటూ ఏ వేవో మాట్లాడుకొన్నారు. రాజకీయాలు, వార్తలు, ఆఫీసు విషయాలు.... ఇదంతా మామూలే. సావిత్రి గంగాధరానికి.

"దేని గురించో వర్రీగా ఉన్నావు. ఏంటది?" అని సూటిగా అడిగాడు

"శివాని గురించి" అంది సావిత్రి.

"ఏమయింది శివానికి."

"ఆ ఫోన్ కాల్స్......"

"రాత్రి సంగతా, వదిలేసెయ్, ఎవరో తుంటరి వెధవలు చేసుంటారు. ఆ రాత్రికి అటువంటి కాల్సు వస్తే పోలీసు రిపోర్టిద్దాం."

సావిత్రి కాదన్నట్టు తల ఊపింది. "ఇప్పటికే రెండు మూడు రోజుల నుంచి కాల్స్ వస్తున్నాయి. మీరు బ్లాంక్ కాల్స్ అన్నారు. కాని శివాని ఫోన్లో మెల్లగా మాట్లాడటం విన్నాను. తనను అడిగితే "రాంగ్ నంబర్" అని రెండు సార్లు చెప్పింది. ఈ రోజు మధ్యాహ్నం ఒక సారి ఫోన్ మోగింది. నేను తీశాను. అవతలివాడు బడబడ వాగేస్తున్నాడు. వెకిలిగా నవ్వుతున్నాడు.

మీ ఇంట్లో ఆడవాళ్ళున్నారా? వయసులో ఉన్నవాళ్ళేనా? వాళ్ళకు ఎవరితోనైనా స్నేహాలున్నాయా? చూడండి చాలా వరకు తెలిసిన వాళ్ళే ఇంత చనువుగా కాల్స్ చేస్తారు. ఇతరులకు తెలీకూడదని జాగ్రత్తగా ఉంటారు. అందుకే బ్లాంక్ కాల్స్, అయినా మీ ఫోన్ టాప్ చేస్తాం. చూద్దాం ఎక్కడినుంచి కాల్స్ వస్తున్నాయో."

రెండు మూడు రోజులు అలాగే గడిచింది. నాలుగు రోజుల తర్వాత పోలీస్ స్టేషన్ నుండి ఫోన్ వచ్చింది. శివానీని కూడా వెంట బెట్టుకు రమ్మన్నారు. ఏమయిందోనని గంగాధరం శివానితో పాటు వెళ్ళాడు. "ఏ విషయమూ ఫోను చేసి చెప్పండి, నేను ఇంట్లోనే వుంటాను" అని సావిత్రి చెప్పింది.

> "కేసు పెట్టండి, ఇలాంటి వాళ్ళకు బుద్ధి రావాలంటే ఆ క్రిమినల్స్‌కు శిక్ష పడాల్సిందే" అన్నాడు గంగాధరం. శివానీ మౌనంగా కూర్చున్నా ఆ అబ్బాయిని ఎడాపెడా వాయించాలని ఉంది, "నేనేం చేశానని నన్నింత చిత్రహింసకు గురి చేశావు? నువ్వు అసలెవరివి? నా జీవితంతో నీకు సంబంధమేమిటి?" అని నిలదీయాలనుంది.

పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వీళ్ళను కూర్చోమని కానిస్టేబుల్‌కు ఏదో చెప్పాడు. కానిస్టేబుల్ లోపలికి వెళ్ళి ఒక అబ్బాయిని వెంటపెట్టుకు వచ్చాడు. శివానీ తలెత్తి చూసి ఆశ్చర్యపోయింది.

"ఈ అబ్బాయి నీకు తెలుసా అమ్మా?" అని అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"కామేశ్ నాతో పాటు ఇన్‌స్టిట్యూట్‌లో కంప్యూటర్స్ నేర్చుకొంటున్నాడు. నేను వాడే కంప్యూటరే నా తర్వాత తను వాడుతాడు. ఆ విధంగా పరిచయం.

"ఈ అబ్బాయి ఏం చేశాడో తెలుసా అండీ" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఏం చేశాడు" అని అడిగాడు గంగాధరం.

"ఏం నాయనా నువ్వు చెప్తుతావా నన్ను చెప్పమంటావా?" గద్దించినట్లు అడిగాడు ఇన్‌స్పెక్టర్.

ఆ అబ్బాయి తలవంచుకొన్నాడు.

"వీడు మీ అమ్మాయి వివరాలు, ఫోను నెంబరు వెబ్‌సైట్‌లో ఇచ్చాడు. పైగా డిస్కోలు, డాన్సులు మరెన్నో హాబీలున్నట్టు, బాయ్స్ కంపెనీ తనకు చాలా ఇష్టమని, సరదాగా ఎక్కడైనా గడపగలనని వ్రాశాడు. దానితో రకరకాల వాళ్ళు సమయం కానీ సమయంలో మిమ్మల్ని కాంటాక్ట్ చెయ్యటం ప్రారంభించారు."

గంగాధరానికి ఒళ్ళు మండుకొచ్చింది. వాణ్ణి తన్నటానికా అన్నట్టు పైకి లేచాడు. ఇన్‌స్పెక్టరు అతణ్ణి చేత్తో వారిస్తూ, "వీడి సంగతి మేము చూసుకొంటాంలెండి. వాళ్ళ తల్లిదండ్రులకు కబురంపాం. వస్తుంటారు. ఇంతకూ మీరు కేసు పెట్టాలనుకొంటున్నారా చెప్పిండి" అని అడిగాడు.

"కేసు పెట్టండి, ఇలాంటి వాళ్ళకు బుద్ధి రావాలంటే ఆ క్రిమినల్స్‌కు శిక్ష పడాల్సిందే" అన్నాడు గంగాధరం.

శివానీ మౌనంగా కూర్చున్నా ఆ అబ్బాయిని ఎడాపెడా వాయించాలని ఉంది, "నేనేం చేశానని నన్నింత చిత్రహింసకు గురి చేశావు? నువ్వు అసలెవరివి? నా జీవితంతో నీకు సంబంధమేమిటి?" అని నిలదీయాలనుంది. కానీ, ఆమెది మృదుస్వభావం. సహజంగా సౌమ్యురాలు. ఎప్పుడూ గట్టిగా వాదించి ఎరుగదు. ఎవరేమన్నా మనసులో బాధపడుతుంది గాని తిరిగి జవాబు చెప్పలేదు. ఆమెకు కోపం వచ్చినా, బాధకలిగినా వచ్చేవి కన్నీళ్ళే.

అందుకే ఇప్పుడామె కళ్ళలో నుండి నీళ్ళు జలజలా రాలిపోతున్నాయి.

"మీరన్నమాట నిజమే గానీ, ఈ కేసులింత త్వరగా తెమలవు. పదిసార్లు కోర్టు చుట్టూ తిరగాలి. వీళ్ళకు బెయిలూ ఇట్టే దొరికిపోతుంది" అన్నాడు ఇన్‌స్పెక్టరు సాలోచనగా.

ఇంతలో కామేశ్ తల్లిదండ్రులు వచ్చారు. "ఏమయింది, ఏమయింది" అంటూ, ఇన్‌స్పెక్టర్ వివరాలు చెప్తుతూనే ఉన్నాడు ఇంతలో కామేశ్ తల్లి లేచి కామేశ్ చెంపలు ఛెళ్ళుఛెళ్ళుమని వాయించింది.

"నీకు ఇంట్లో ఒక చెల్లెలుందన్న జ్ఞానమైనా లేదా? ఇదేనా నువ్వు నేర్చుకొన్న టెక్నాలజీ. ఇన్‌స్పెక్టరు గారు వీడికి ఏమి శిక్ష విధిస్తారో విధించండి. మేము అడ్డుచెప్పం. ఆఖరికి ఉరి తీసినా సరే" అంది కోపంగా.

కామేశ్ తండ్రి ఆమెను శాంతపరుస్తూ "ఊరుకో" అని గంగాధరానికి క్షమాపణ చెప్పుకొన్నాడు. "చిన్నవయసులో పిల్లలు ఎక్కడెక్కడ తిరుగుతారో ఏం చేస్తారో మనకు తెలీదు. మావాడు చేసింది పెద్ద తప్పే, కొత్తగా నేర్చుకొన్న విద్యను వాడీ విధంగా ప్రదర్శించుకున్నాడు. దీని ఫలితాలు ఆలోచించి ఉండడు. క్షమించండి, ఇప్పుడు కోర్టులూ, కేసులూ అంటే వీడి భవిష్యత్తు పాడవుతుంది, మీ బిడ్డే తప్పు చేసాడనుకొని కొట్టండి. తిట్టండి. బుద్ధి చెప్పండి. కానీ క్షమించండి. అంకుల్‌ను క్షమాపణకోరు. సే సారీ" అని కొడుకుతో అన్నాడాయన. కామేశ్ మొహం అప్పటికే ఎర్రబడింది. తలవంచుకుని వచ్చి గంగాధరం పాదాలు తాకి "క్షమించండి అంకుల్. ఏదో తమాషాగా చేశాను. ఇంత సీరియస్ అవుతుందనుకోలేదు. ఐ యామ్ వెరీవెరీ సారీ శివానీ. ప్లీజ్" అని చేతులు జోడించాడు.

కన్నీళ్ళతో ఎర్రబడ్డ కళ్ళను పైకెత్తి చూసింది శివానీ. వాటిలో కోపంలేదు, ద్వేషం లేదు. పగ అసలే లేదు. ఉన్నదల్లా జ్వలిస్తున్న బాధ, "ఎందుకు" అన్న ప్రశ్న మాత్రమే. ●